

# ఎవరు చెప్పగలరు?

**ఎదురెదురుగా కూర్చున్నారిద్దరూ. ప్రశాంతత లేదక్కడ. ఎవరి ఆలోచనలు వాళ్లవి. బయట పెట్టుకోడానికి చేస్తున్న ప్రయత్నమే అది.**

"నేనిష్టపడి చేసే ప్రతి దానికీ మీకు సంజాయిషీ ఇచ్చుకోవడం నా వల్ల కానిపని! నా ఆత్మాభిమానం దెబ్బతినేలా మీ జోక్యం ఉంటే నేను సహించలేను!" ముందుగా చెప్పాలనుకున్నది సూటిగా, స్పష్టంగా చెప్పింది ప్రమీల.

"అంటే .... నాతోగానీ, నా ఆలోచనలతో గానీ నీకు సంబంధమే లేదా?" విసురుగా అడిగాడు కుమార్.

"సంబంధం లేదని ఎవరన్నారు? నువ్వు నా ఆలోచనలమీద దురాక్రమణ చేయకుండా ఉంటే చాలు, నన్ను నన్నుగా బతకనీయడం నీకు చాతకాదా?" ఎదురు ప్రశ్న వేసిందామె.

"మనమధ్య నీది, నాది అనే బతుకెక్కడిది? ఇద్దరం ఒకటిగా బతుకుతోంది నిజం కాదా?" విస్మయం కుమార్ కళ్లల్లో.

"ఆర్గ్యుమెంటు వద్దు! నాకు నచ్చని విషయాల్లో నువ్వు జోక్యం చేసుకోకు! నన్ను హర్ట్ చేయకు, ప్లీజ్!"

"అసలు మనమెందుకు పెళ్లి చేసుకున్నట్టు?" కుమార్ రెట్టించాడు.

"పెళ్లికి, నా అభిప్రాయాలకు సంబంధం ఏముంది? పెళ్లి చేసుకున్నాం కదా అని నువ్వు చెప్పినట్లే నేను నడవాలా? నాకంటూ సొంత నిర్ణయాలు లేవా? నాకు నేనుగా ఆలోచించుకోలేనా?" ఆవేశంగా అంది ప్రమీల.

"చాలా దారుణంగా మాట్లాడుతున్నావ్! నీకు భర్తగా, నా అధికారాన్ని ఎప్పుడన్నా చెలాయించానా? నీ ఆలోచనలకు అడ్డు తగిలానా? నీ మనసులో ఏదో ఉంది. నువ్వు ఒకప్పటి ప్రమీలవు కాదు. నీ కోసం నేను, నా కోసం నువ్వు ఎదురు చూడటం తప్పు అంటున్నావ్. అసలు నీ గురించి ఆలోచించడమే తప్పు అయితే, నేను నీ భర్తగా ఉండటం కూడా తప్పే!"

"నువ్వెలా అనుకున్నా నాకభ్యంతరం లేదు. మన పెళ్లికి ముందే చెప్పాను మనం ఒకరినొకరు అర్థం చేసుకున్నాం అంటే ఒకరి అభిప్రాయాలను ఒకరు అర్థం చేసుకున్నట్లేగా! కేవలం మనది అండర్‌స్టాండింగ్ మారేజ్! ఆ విషయం మర్చిపోయి నువ్వేదో నన్ను పెంచి పోషిస్తున్నట్లు ప్రవర్తిస్తే నాకు నచ్చదు!" మరికాస్త రెట్టించింది ప్రమీల.

"చూడు, కుమార్! నువ్వు నా భర్తవే. నువ్వో

బ్రిలియంట్ స్టూడెంట్‌వని నీ మీద మనసు పడ్డాను. నీతో జీవితాన్ని పంచుకోవడం గ్రేట్ అనుకునేదాన్ని. మన క్లాస్‌లో అమ్మాయిలకు నువ్వంటే క్రేజ్. నేనూ అలాగే క్రేజ్ పెంచుకున్నాను. అలాగని నేనెట్లా ఇన్‌ఫీరియర్‌గా బతకలగను?

"నాకు లైఫ్ ఎప్పుడూ ఫాస్ట్‌గా సాగిపోవాలనిపిస్తుంది. ప్రేమ, జీవితం, పిల్లలు నాకంతగా సరిపడవు. ముందు లైఫ్‌ను ఎంజాయ్ చేశాకే అన్నీనూ. నా భావాలను నీకు స్పష్టంగా చెప్పినప్పటికీ నన్ను హర్ట్ చేస్తున్నావు. నేను ఏడ్చినా, నవ్వినా నాకు సంబంధించిందేగా! వాటికి కారణాలు కూడా నేనే వెతుక్కుంటాను. భార్య అనే చట్రంలో నన్ను బంధించకు!" ఉద్వేగాన్ని ఏమాత్రం దాచుకోకుండా చెప్పేసి బయటకెళ్లిపోయింది ప్రమీల.

ఈ కాంట్రవర్సీ సడెన్‌గా వచ్చింది కాదు. దంపతులైన ఆ ఇద్దరూ పెరిగిన వాతావరణం, సామాజిక స్థాయి, ఆర్థిక పరిస్థితులు, ఆవేశం వంటి కారణాలు కావచ్చు.

ఢిల్లీ యూనివర్సిటీలో ఇద్దరూ రీసెర్చ్ స్కాలర్సే. కుమార్ ఎం.ఎస్.సి.లో గోల్డ్ మెడల్ సాధించిన రోజే ప్రమీలను రిజిస్టర్ మారేజ్ చేసుకున్నాడు. ఆ పెళ్లికి స్నేహితులు తప్ప, బంధువులెవ్వరూ రాలేదు.

ప్రమీల పెళ్లి ప్రపోజల్ తెచ్చిన రోజు ఆమె ఎలా నిర్ణయం తీసుకుంది? ఆ నిర్ణయం వెనుక ఉన్న ఉద్దేశ్యం ఏమిటి? అన్న విషయాల గురించి కుమార్ ఆలోచించలేదు. తను పెరిగిన వాతావరణం గురించి, తన వాళ్ల గురించి ఆలోచించాడు. ఒక్క రోజు కాదు .... నెలలతరబడి ఆలోచించాడు. అతని అంతరంగం వద్దంటున్నప్పటికీ నిర్ణయం తీసుకోక తప్పలేదు.

అలా జరిగిపోయిన పెళ్లి తర్వాత ... ముచ్చటగా మూణ్నెళ్లు జరిగిపోయాయి.

ఆకాశం ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటే, దాని గొప్పదనం ఏముంది? జీవితం కూడా అంతే! ప్రశాంతంగా కనిపిస్తూనే ఉరుముతుంది. జోకొడుతూనే జ్వాల పుట్టిస్తుంది.

'హిపోక్రసీ, ఇగోయిజం, సుపీరియారిటీ, ఇండివిడ్యువలిజం...' ఇవన్నీ ఎలా ఉంటాయో ఒక్కసారి ఆలోచిస్తే ఏ వ్యక్తికీ బతకాలనిపించదు.

ఆమె తన భావాలతో నింపుకున్న పుస్తకం పేజీలు ఎప్పుడు తెరుచుకుంటాయా అని ఎదురు చూసిన కుమార్ అలసిపోయాడు. అది మూసుకుపోయిన జీవితాన్ని ప్రతిబింబిస్తుంటే ఒంటరిగా కుమిలిపోయాడు.

ఎన్నాళ్లని ఎదురు చూస్తాడు? పరిష్కరించుకోగలిగే సమస్యలు కూడా పెద్దవిగా కనిపిస్తుంటే ఏం చేయగలడు?

చూరునుండి కారే వర్షం ధారలా ఆలోచనలు ఎక్కడా తెగడంలేదతనికి.

కారణాలు ఏమైనా, ఎంచుకున్న జీవితం దారి మళ్లిపోతుంటే పరిష్కరించుకోలేకపోవడం అందమైన కృత్రిమ జీవితం లక్షణం.

ఏవో చిన్న చిన్న ఘర్షణలు ... పేరుకు చిన్నవే!

కానీ, కార్చిచ్చులా మనసుల్ని కాల్చేస్తున్నాయి. హిపోక్రసీ ఆమెను కమ్మేసింది. ఆత్మాభిమానం అనే ముసుగు క్రమేపీ బిగుసుకుపోయింది. నేనే అన్న భావన విషవలయంలా ఆమెను చుట్టేసింది. తొందర్లో తెచ్చిపెట్టుకున్న ప్రేమ అనుబంధాల్ని పెంచలేకపోయింది. అవకాశవాదం మనసుల్ని కలపలేకపోయింది.

ఫలితం ....

అంతులేని అన్‌రెస్ట్!

కుమార్‌వంటి బ్రిలియంట్ స్టూడెంట్ ఇప్పుడామె దృష్టిలో మంచి భర్త కాదు! చివరకు ....

జీవితమనే హై లెవల్ డ్రామాలో కుమార్ ప్రేక్షకుడుగానే మిగిలిపోవాల్సి వచ్చింది.

ప్రేమ ... జీవితం .... వాళ్లకు వీటి అర్థాలు తెలుసు. లోతైన భావాలూ తెలుసు. అయితే, వాటి ప్రాధాన్యతను ఆమె గమనించలేకపోయింది. అతను ఆమెతో అడ్జెస్ట్ కాలేకపోయాడు.

"ఆధునిక జీవితం, ఖరీదైన ఆలోచనలు, అల్లుకుపోలేని అనుబంధం, అందుకోలేని ప్రేమానుబంధం!"

చివరకు ఇద్దరి మధ్యా పెరిగిపోతున్న దూరం కాలంతో జత కలిపి భారంగా నిట్టూర్చింది.

000

"మరో చోట ..."

ప్రేమానురాగాలు పోటీ పడుతున్నాయి. క్షణాలన్నీ ఎదురు చూపులతోనే గడిచిపోతున్నాయి.

ఆశగా ఎదురు చూస్తోంది గౌరమ్మ.

ఆలోచనలో పడిపోయాడు వీరన్న.

"మన పిల్లాడు తప్పకుండా వత్తాడు, గౌరమ్మా! నువ్వెందుకట్టా బెంబేలు పడిపోతావు?" నులకమంచం వాలుస్తూ అన్నాడు వీరన్న.

"సానా రోజుల్నుండి ఇట్టాగే సెబుతున్నావ్. దీపావళి, సంకురాత్రి ఎల్లిపోయినాయి. పిల్లాడు మాత్రం రానేదు. ఆడు సెప్పా పెట్టకుండా పెళ్లి సేసుకున్నాడని కాదు నా బాధ, ఉత్తరం రాసి మూడు మాసాలైంది కదా! కోడలు పిల్లను తీసుకొత్తాడని ఎదురు సూత్తున్నాను. నా గుండెలో బాధ నీ కెట్టా సెప్పేదయ్యా?" కన్నీళ్లు పెట్టుకుంది గౌరమ్మ.

"నాకు మాత్రం బాధ లేదంటావా? అడ్డీ కన్నం కనుకే ఆడి బాధల్లోను, కష్టాల్లోను ఇంతకాలం తోడుగా ఉన్నాం. సెమటోడ్చి ఆడిని సదివించినాము. ఆడు పెద్ద సదువులు సదివి పెద్దింటి పిల్లను పెళ్లి సేసుకున్నందుకు ఎంత సంతోసపడిపోతున్నానో నీకెలా సెప్పనే! ఉత్తరం రాసి ఇన్ని రోజులవుతున్నా రాలేదని నా మనసు కూడా తట్టుకోనేకపోతుందే ...!" ఆవేదనగా అన్నాడు వీరన్న.

పెద్ద పెద్ద పదాలకు అర్థాలు తెలియని ఈ దంపతుల ఆవేదనకు, ఆరాటానికి భాష్యం చెప్పడం అంత తేలిక కాదు.

తిట్టుకున్నా, అరుచుకున్నా, ఒకరినొకరు కొట్టుకున్నా .... రాత్రయ్యేసరికి ఒకరి మీద ఒకరు అభిమానం చూపించుకుని ప్రశాంతంగా నిద్రపోయే పిచ్చి తల్లిదండ్రులకు అందంగా కనిపించే కృత్రిమ జీవితం గురించి, అధికారం చెలాయించాలనుకునే ఆధునిక ప్రేమ గురించి ఎలా తెలుస్తుంది?

000

అక్కడ కుమార్ ఆలోచనలు మరోలా ఉన్నాయి.

తల్లిదండ్రులకు ఆశ కల్పించాడు. పెళ్లి చేసుకున్నాను. కోడల్ని తీసుకొస్తానని ఉత్తరం రాశాడు. ఇప్పుడేం చేయగలడు? ఆ అమాయకులకేం చెబుతాడు?

పెళ్లి చేసుకున్న మూణ్నెల్లకే బతుకులు చెరో దారీ అయ్యాయని చెబుతాడా?

ఏం చెబితే చదువురాని ఆ తల్లిదండ్రులకు అర్థమవుతుంది? జీవితాన్ని రెండు కళ్లతో చూడకుండా నాలుగు కళ్లు ఎందుకు లేవు అని బాధపడే మనుషుల మధ్య ఉన్న ప్రమీల ఎన్ని ప్రయాణాలు చేసినా అలసిపోక తప్పదు!

అందుకే .... కుమార్ వెనక్కి జారిపోతున్న ఆలోచనల్ని ఒడిసిపట్టుకుంటున్నాడు. తనకు, తల్లిదండ్రులకు మధ్య దారుణంగా నలిగిపోతున్న అనుబంధం గుర్తొస్తోందతనికి. ఆ అనుబంధాన్ని బతికించుకోవాలి. వాళ్ల ఆశలు చచ్చిపోయినా మళ్లీ చిగురింపచేయవచ్చు .... వాళ్ల నమ్మకం కరిగిపోయినా మళ్లీ బతికించుకోవచ్చు. తను వెళ్లకుండా వంచించడం ...

ఎదురు తిరిగింది కుమార్ మనసు. వెళ్లాలి! తల్లిదండ్రులను చూడాలి. జరిగింది చెప్పాలి! మనసునిండా ఓదార్పునందుకోవాలి!

"ప్రేమంటే బతికించుకోవడం
జీవితమంటే బ్రతకడం!"

ప్రమీలకే కాదు, ప్రమీలవంటి ఎంతోమందికి ఎవరు చెప్పగలరు ఈ వాస్తవాన్ని? ఎవరు నమ్మించగలరు ఈ నిజాన్ని?

చెప్పేవాళ్లున్నారు. అక్కడే సేద తీరాలి!

"ఇది నిఝంగా నిజం!"

ఇంత గొప్ప పదాలకు అర్థం చెప్పగలిగేవారు నా దృష్టిలో నా తల్లిదండ్రులకన్నా గొప్పవాళ్లెవరున్నారు ...? అనుకుంటూ ఆలోచనల్ని ఆపేశాడు కుమార్.

■

**కోరం రాజబాబు**